క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకరూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన ఆకారం, గోసాన్‌పల్లి, చీకోడ్ గ్రామాల క్రీడాకారులకు ఆకారంలో ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి పోటీల్లో గెలుపోటములు సహజమని నేటి ఓటమే నేటి గెలుపునకు పునాదిలాంటిదని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): గత ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి అన్నారు. దూల్మిట్ట మండలంలో ఏర్పాటు చేసిన సీపీఎం మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2018 ఎన్నికలో రుణమాఫీ చేస్తామని చెప్పి నేటికీ నాలుగున్నర ఏళ్లు గడుస్తున్నా రుణాలన్నీ మాఫీ కాలేదన్నారు. గతంలో రూ.25వేలలోపు ఒకసారి, రూ.50వేలలోపు మరోసారి మాఫీ చేస్తామని చెప్పినా ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. అదే విధంగా బీసీ కులవృత్తిదారుల రుణాల గడువు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శశిధర్, నాయకులు రవికుమార్, కనకయ్య, రంజిత్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మిశ్రమ సరుకులకు బహిరంగ వేలం

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి వచ్చిన మిశ్రమ సరుకులకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి విశ్వనాథశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. మిశ్రమ బియ్యం, ఎండు కుడుకలు, పోకలు, ఖర్జూరాలు, పసుపు కొమ్ములు అమ్మకం కోసం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొని సరుకులు పొందాలని పేర్కొన్నారు.

'రైతు సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం'



మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

దుబ్బాక: రైతు రుణమాఫీ విషయంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం మాట తప్పి రైతులను మోసగించిందని వైఎస్సార్‌టీపీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబ్బాక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేస్తామన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లు దాటినా మాట నిలుపుకోలేదని మండిపడ్డారు. వడ్ల కొనుగోలుతో పాటు డబ్బుల చెల్లింపులో కూడా జాప్యం జరుగుతోందని ఆరోపించారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కౌలు రైతులను ఆదుకోవడంలో సీఎం కేసీఆర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

గజ్వేల్‌రూరల్: అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో ప్రభుత్వం ఆత్మస్థైర్యం నింపుతూ మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు కొల్గూరు గ్రామ ఎంపీటీసీ జ్యోతిస్వామి పేర్కొన్నారు. గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన నిమ్మరాజు ఆదిత్యకు రూ.17,500, అయిల నరేశ్‌కు రూ.22వేల చొప్పున మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు, కొల్గూరు గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నరేశ్, వార్డుసభ్యులు ప్రభాకర్, గణేశ్, సోషల్ మీడియా కన్వీనర్ సంపత్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మంచినీళ్ల పండగ



వర్గల్(గజ్వేల్): రక్షిత తాగునీటి ప్రయోజనాలను వివరిస్తున్న అధికారులు

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం దశాబ్ది కాలంలో మారుమూల గిరిజన తండాలకు సురక్షితమైన మిషన్ భగీరథ తాగునీటిని అందిస్తుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మమత అన్నారు. మన ఊరు తాగునీటి వనరులను సంరక్షించుకోనే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో మంచినీళ్ల వేడుకలను ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సాయి, విజయలక్ష్మి, లావుడ్య స్వరూప, మధు, సునీత, సుశీల, సంపత్, తోడేటి రమేశ్, బాలస్వామి, రాంచంద్రారెడ్డి, భారతి, పోలవేని లత, రజిత తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో అక్కన్నపేట మండలంలో ఊరూరా మంచినీళ్ల పండగను ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నాడు–నేడు మంచినీళ్ల కోసం గోసపడ్డ ఫొటోలను ప్రదర్శించి ఫ్లెక్సీలను పట్టుకొని గ్రామాల్లో ర్యాలీలు తీశారు. అనంతరం గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద ప్రతిజ్ఞ చేశారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆదివారం మంచినీళ్ల పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్ మెన్‌లను ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ గజ్జెల సాయిలు, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, జెడ్పీటీసీ సూకూరి లింగం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): మిషన్ భగీరథ ద్వారా ప్రభుత్వం ఇంటింటికీ రక్షిత తాగునీరు అందిస్తుందని మిషన్ భగీరథ అధికారులు పేర్కొన్నారు. వర్గల్ పంచాయతీ వద్ద ఉపసర్పంచ్ రమేశ్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా మంచినీటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాటర్ మ్యాన్ మహబూబ్, నరేశ్‌లను అవార్డులతో సన్మానించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ, మైక్రోబయోలజిస్ట్ మాధవి, కెమిస్ట్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అక్కన్నపేట(హుస్నాబాద్): పంతుల్‌తండాలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు



హుస్నాబాద్‌రూరల్: పోతారం(ఎస్)లో..



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో..



మద్దూరు(హుస్నాబాద్): తాగునీటి ప్రయోజనాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు



నంగునూరు(సిద్దిపేట): జేపీ తండాలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు



చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో..

ప్రాజెక్టుల నిర్మాణంతో సస్యశ్యామలం



కొమురవెల్లి(సిద్దిపేట): మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కరువు నేల కరువు తీరిందని మల్లన్న గడప కడిగామని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీళ్ల పండగను పురస్కరించుకొని మల్లన్నసాగర్ నుంచి 400 బిందెలతో మహిళలు తీసుకొచ్చిన నీళ్లతో డప్పు చప్పుళ్ల మధ్య కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ గడప కడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మహిళా కష్టాలను చూసి సీఎం కేసీఆర్ ప్రతి ఇంటికీ శుద్ధమైన నీటిని అందించాలని మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ గడపకూ నీరందించారన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ దేశానికే దిక్సూచి అని, ప్రపంచంలోనే అదిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌తో ఒకప్పటి కరువునేల కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ ప్రాజెక్టుల నిర్మాణంతో సస్యశ్యామలమై ప్రపంచానికే అన్నంపెట్టే స్థాయికి ఎదిగిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నీళ్ల పండగను విజయవంతం చేసిన మహిళలకు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తలారి కీర్తన, ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, సర్పంచ్ సార్ల లత, బచ్చన్నపేట, మద్దూరు, జనగామ మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

చేర్యాల(సిద్దిపేట): బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణను కిడ్నాప్ చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన నీళ్ల పండగ కార్యక్రమంలో పాల్గొనేందుకు చేర్యాలకు వచ్చిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి జనగామ రైతుబంధు అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బచ్చన్నపేట మండల అధ్యక్షుడు, పలువురితో కలిసి మాట్లాడుతూ.. శాంతియుతంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం జరిగిన జనగామ గడ్డపై హత్యా రాజకీయాలకు తావు లేదన్నారు. అంతకుముందు స్థానిక పెద్ద చెరువు మత్తడి నీటిని తరలించేందుకు చేపడుతున్న కాల్వ నిర్మాణంలో భూమి కోల్పోతున్న కొందరు రైతులు పనులు అడ్డుకున్న విషయమై వారితో మాట్లాడి సమస్య పరిష్కరించారు. అదేవిధంగా స్థానిక కౌన్సిలర్ నరేందర్ ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే కౌన్సిలర్ తండ్రి ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం చేర్యాల, మద్దూరు, దూల్మిట్ట మండలాలకు చెందిన మహిళలతో కలిసి మంచినీటి పండగలో పాల్గొనేందుకు మాత్‌పల్లి వెళ్లారు. ఆయన వెంట స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, ఎంపీపీలు ఉల్లంపల్లి కరుణాకర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు అనంతుల మల్లేశం, మంద యాదగిరి, రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, నాయకులు రంజిత, పార్వతి, వెంకట్‌రెడ్డి, సదానందం, బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): అర్హులందరికీ రూ.లక్ష రుణం ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అజ్జుయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బీసీల్లోని కొన్ని కులాలకు మాత్రమే రుణాన్ని పరిమితం చేయడం సరికాదన్నారు. రుణం కోసం దరఖాస్తు చేసుకునే వారు ఆదాయ పత్రాన్ని అందజేయాలని ఆదేశించడం సరికాదన్నారు. బీసీల్లో ఎన్నోకులాలు ఉండగా కేవలం ఏడు కులాలకు మాత్రమే సబ్సిడీ రుణాలు అందిస్తామనడం బీసీల ఐక్యతను దెబ్బతీయడమేనన్నారు.

◆ నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): మండల స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం బెజ్జంకిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెగ్గలం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కనపర్తి అనీల్, ప్రధాన కార్యదర్శిగా వెగ్గలం సంతోష్‌కుమార్, కోశాధికారిగా తిప్పర్తి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా కనపర్తి నర్సింహాచారిలను ఎన్నుకున్నారు.

◆ నేడు మండల సర్వసభ్య సమావేశం

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు మండల సమావేశం సోమవారం నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్ తెలిపారు.ఉదయం 11గంటలకు నిర్వహించేసమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు.

◆ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మండలంలోని పలుగుగడ్డ గ్రామానికి చెందిన కుమార్ కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి, అనంతరం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా హమాలీ సంఘం ఆధ్వర్యంలో రూ.7వేల సాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరిరవి, అంజయ్య, నర్సింలు, చంద్రం, కనకయ్య, కుమార్, కరుణాకర్ పాల్గొన్నారు.

◆ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలని మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని మునిగడప గ్రామంలో మాల మహానాడు గ్రామ కమిటీని మండలాధ్యక్షుడు శివలింగం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సారి కమిషన్ చైర్మన్ మాలలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దశరథ, రాజు, సత్తయ్య, యాదగిరి, నవీన్, కిరణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

◆ 25న జిల్లా సదస్సు

సిద్దిపేటకమాన్: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోరుతూ మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో సిద్దిపేటలో ఈ నెల 25న జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సదస్సులో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాభివృద్ధికి సమష్టి కృషి



తూప్రాన్: చెత్తను తొలగిస్తున్న గ్రామస్తులు

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో 364 వారాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గ్రామస్తులు కొనసాగిస్తున్నారు. ప్రతీ ఆదివారం గ్రామ అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తూ భాగస్వాములు అవుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని 6వ వార్డులో నిర్వహించారు. పరిసర ప్రాంతాలను, సీసీరోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. అదేవిధంగా చెట్లకు పాదులు వేశారు. గ్రామంలో ఇప్పటివరకు నిరంతరాయంగా 364 వారాలుగా స్వచ్ఛభారత్ చేపడుతున్నామని సర్పంచ్ మహాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంజనేయులుగౌడ్, పంచాయతీ కార్యదర్శి మహేందర్ రెడ్డి, ఐకేపీ వీవోఏ సంతోష, మెకిన్ యూత్ ఉపాధ్యక్షుడు శ్రీను, స్పెషల్ ఆఫీసర్ సురేశ్, పాలకవర్గ సభ్యులు, మెకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యువత ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. 270వ వారంలో భాగంగా పలు వీధుల్లో యువకులు పిచ్చిమొక్కలను తొలగించారు. చెత్త చెదారాన్ని డంప్‌యార్డులకు తరలించారు.

మోదీ నాయకత్వంలో అగ్రగామిగా భారత్

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాకలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు, కార్యకర్తలు

దుబ్బాకటౌన్: ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే భారత్ గొప్ప దేశంగా వెలుగొందుతుందని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ నాయకత్వంలో అన్ని రంగాల్లో భారత్ అగ్రగామిగా రూపుదిద్దుకుందన్నారు. హిందూ ధర్మ సంస్కృతీ, సంప్రదాయాలతో పాటు దేశ ఔన్నత్యాన్ని ప్రపంచమంతటా కీర్తించేలా కృషి చేశాడన్నారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. ఇప్పటి నుంచే బూత్ స్థాయి నుంచి పటిష్టంగా తయారై కాషాయ జెండా ఎగరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు వివరిస్తూ చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్: ప్రధాని మోదీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ 102వ ఎపిసోడ్‌ను ఆదివారం పట్టణంలోని ఓ బీజేపీ కార్యకర్త ఇంటిలో వీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి హాజరై మోదీ సందేశాన్ని విన్నారు. అదేవిధంగా పట్టణంలోని 9వ బూత్‌లో కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు వేల్పుల నాగార్జున్ ఆధ్వర్యంలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. సమయానికి కరెంట్ పోవడంతో సెల్‌ఫోన్‌లో ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ బాణాల జయలక్ష్మి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల అధ్యక్షులు విద్యాసాగర్‌రెడ్డి, వీరాచారి, స్వరూప, కర్ణకంటి నరేశ్, సతీశ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలి



గౌడ కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌ను మండల గౌడ సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులకు దళిత బంధులా గౌడబంధు ఇవ్వాలని, గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేని నర్సాగౌడ్, ఉపాధ్యక్షుడు నర్సింహులుగౌడ్, రసులాబాద్ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్, మేరుగు కృష్ణగౌడ్, బొడిగె గురువయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికీ బీజేపీ'ని విజయవంతం చేద్దాం



టిఫిన్ బైటెక్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు

హుస్నాబాద్: ప్రధాని మోదీ నేతృత్వంలో 9 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలో టిఫిన్ బైటెక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బొమ్మ శ్రీరాంచక్రవర్తిలు హాజరై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ అంతర్గత విషయాలు, భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళికపై చర్చించినట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి 30వ తేదీవరకు ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9 సంవత్సరాలుగా మోదీ నేతృత్వంలో దేశం ఏ విధంగా పురోగతి సాధించిందో తెలియజేయాలన్నారు. మోదీ పాలనను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని వారు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, అసెంబ్లీ కో–కన్వీనర్ వేణుగోపాల్‌రావు, నాయకులు దొడ్డి శ్రీనివాస్, బత్తుల శంకర్‌బాబు, విద్యాసాగర్ రెడ్డి, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న మాధవానంద సరస్వతి

దుబ్బాకటౌన్: తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన దుబ్బాక పట్టణంలోని బాలాజీ ఆలయంలో ఆదివారం కల్యాణ వేంకటేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మాధవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భగవన్నామస్మరణతోనే సకల సంపదలు కలుగుతాయని మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. భగవంతుడి మహిమలపై భక్తులకు స్వామిజీ అనుగ్రహ భాషణం చేశారు. ఆలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామి మహిమగల దేవుడని కొలిచిన భక్తులకు శుభాలు కలిగిస్తాడన్నారు.

దరఖాస్తు తిప్పలు

- గడువు సమీపిస్తుండటంతో అర్హుల అగచాట్లు
- సర్వర్ డౌన్‌తో కార్యాలయాల వద్ద పడిగాపులు
- సెలవురోజున రెవెన్యూ సిబ్బంది విధులు



మీ సేవా కేంద్రంలో దరఖాస్తుదారుల క్యూ

హుస్నాబాద్: ప్రభుత్వం బీసీ కులవృత్తులకు అందించనున్న రూ.లక్ష రుణం సాయం కోసం అర్హులు నానా పాట్లు పడుతున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టగా, ధ్రువపత్రాల కోసం మీసేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నెల 20 దరఖాస్తుకు చివరి తేదీ కావడంతో ఆదాయ, కుల, నివాస పత్రాల కోసం కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. పాఠశాలల విద్యార్థులు కూడా సర్టిఫికెట్ల కోసం వస్తుండడం, మరోవైపు సర్వర్ డౌన్ కావడంతో కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు.

భారీగా దరఖాస్తులు

ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయానికి ఆదాయ ధ్రువీకరణకు 1318 దరఖాస్తులు, కుల ధ్రువీకరణకు 775, నివాసం కోసం 61 దరఖాస్తులు వచ్చాయి. మీ సేవా కేంద్రాల్లో కుప్పలుగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సర్వర్ డౌన్ కావడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సెలవు రోజు విధులు

బీసీ రుణ దరఖాస్తు గడువు సమీపిస్తుండడంతో హుస్నాబాద్ తహసీల్దార్ అధికారులు, సిబ్బంది ఆదివారం సెలవు రోజు విధులకు హాజరై ధ్రువీకరణ పత్రాల జారీ చేపట్టారు. రాత్రి 12 గంటల వరకు సిబ్బంది పని చేస్తున్నా సర్వర్ అంతరాయంతో అధికారులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరో వైపు మీ సేవా కేంద్రాల్లో రాత్రి 7 గంటల వరకు మాత్రమే అడపా దడపా ఆన్‌లైన్ పని చేస్తుందని, ఆ తర్వాత పూర్తిగా పని చేయడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. బీసీ రుణాల కోసం వందలాది మంది దరఖాస్తులు చేసుకుంటున్నారని, ప్రభుత్వం అందించే రుణం ఎవరికి వస్తుందో లేదో తెలియదు కానీ దరఖాస్తుల పేరిట మీ సేవా నిర్వాహకులకు కాసుల పంట పండుతుంది.

గడువు పెంచాలి



బీసీ రుణాలకు ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు పెట్టుకున్నాను. కేవలం ఆదాయ ధ్రువీకరణ మాత్రమే ఇచ్చారు. కుల ధ్రువీకరణ కోసం పదిరోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. తేదీల వారీగా దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ నెల 20వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. ఈలోగా పత్రాలు రాకుంటే మా పరిస్థితి ఏమిటి. సర్వర్‌డౌన్ కాకుండా చర్యలు తీసుకొని ఈ నెలాఖరు వరకు గడువు పెంచాలి.

– రమేశ్, హుస్నాబాద్